క్లుప్తంగా

నేడు 59వ వార్డులో గడప గడపకు ..

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు వాయుపుత్రకాలనీ సచివాలయం (331) పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుంది. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొంటారు. అర్హత ఉండి పథకాలు రాకపోతే వారి సమస్య తెలుసుకుని,అక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడుతారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్, తదితరులు హాజరవుతారు. కార్యక్రమం అనంతరం ఆడారి ఆనంద్‌కుమార్ 61వ వార్డు మల్కాపురం వద్ద వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో జరగనున్న కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

చిన్నారావుకు సన్మానం


చిన్నారావు దంపతులను సత్కరిస్తున్న పల్లా శ్రీనివాస్

మల్కాపురం: డాక్‌యార్డ్‌లో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన చిన్నారావును గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. 58వ వార్డు పిలకవాని పాలెంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్నారావు కార్మికులకు సేవలు అందించారని అభినందించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నాయకులు నక్క లక్ష్మణరావుయాదవ్, కాకి పోలిరెడ్డి,మజ్జి సోమేష్,రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు కుంకుమ పూజలు


దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం దుర్గానగర్‌లోని దుర్గమాంబ ఆలయంలో ఆషాడ మాస పాడ్యమి పురస్కరించుకుని మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

రేపు పెంపుడు కుక్కలకు టీకాలు


ఏడీ రవికుమార్

గోపాలపట్నం: ప్రపంచ జూనోసిస్‌డే సందర్భంగా గోపాలపట్నం ప్రాంతీయ పశుల ఆస్పత్రిలో గురువారం పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ ర్యాబిస్ టీకాలు వేయనున్నట్టు వెటర్నరీ ఏడి రవికుమార్ తెలిపారు. జీవీఎంసీ 89, 90, 91, 92 వార్డుల పరిధిలో పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు టీకాలు వేస్తామన్నారు.

కేవీ-1లో 'బాలవాటిక-3'కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

కంచరపాలెం: కేంద్రీయ విద్యాలయం-1 శ్రీవిజయనగర్ 104 ఏరియా ఇండస్ట్రియల్ ఎస్టేట్ పాఠశాలలో 'బాలవాటిక-3' (యూకేజీ)కి గురువారం నుంచి https://no1 srivijayanagar.kvs.acin ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ కోరారు. విద్యార్థి పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, సర్వీస్ సర్టిఫికెట్, నివాస ధ్రువపత్రం దరఖాస్తులో పొందుపరచాలన్నారు. విద్యార్థి వయస్సు 5 ఏళ్లు నిండి ఆరేళ్లలోపు ఉండాలన్నారు. దరఖాస్తుకు ఆఖరు తేదీ ఈ నెల 18వ తేదీ. 20న ఫలితాలు, 21 నుంచి 28వరకు అడ్మిషన్ ప్రక్రియ, 29న తరగతులు ప్రారంభమతాయని ఆయన తెలిపారు.

అర్హులందరికీ పథకాలు అందించేందుకే..

- 'జగనన్న సురక్ష' రూపకల్పన
- హౌసింగ్ పీడీ పాపునాయుడు


62వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు


సుసర్ల కాలనీలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న పీడీ పాపునాయుడు, తహసీల్దార్ జయ, జెడ్సీ మల్లయ్యనాయుడు

గోపాలపట్నం: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని గృహనిర్మాణ శాఖ పీడీ కె.వి.పాపునాయుడు అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు సుసర్ల కాలనీ, కాకానినగర్ ప్రాంతాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. 468, 469, 470 సచివాలయాలకు సంబంధించి సుసర్ల కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల కొందరికి ధ్రువ పత్రాలు అందలేదని, వాటిని సరిచేసి ఈ కార్యక్రమం ద్వారా అందిస్తున్నామని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ కార్యదర్శుల సమన్వయంతో తక్కువ సమయంలో పత్రాలు అందిస్తున్నామని తెలియజేశారు.

820 ధ్రువపత్రాలు మంజూరు

కాకానినగర్‌లో 473, 474, 475 సచివాలయాలకు గాను కాకానినగర్‌లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పలువురికి ధ్రువపత్రాలు అందించారు. జోన్-8 కమిషనర్ మల్లయ్య నాయుడు స్థానికులు అడిగిన సమస్యలకు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ధ్రువపత్రాలు, బర్త్..డెత్ సర్టిఫికెట్లు, రేషన్ కార్డుల సమస్యలుంటే పరిష్కరించుకోవాలని సూచించారు. 90వ వార్డు పరిధిలో ఈ కార్యక్రమంలో 961 దరఖాస్తులు రాగా 820 ధ్రువపత్రాలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి, వార్డు సీనియర్ నాయకుడు నమ్మి శ్రీను, తహసీల్దారు కొర్ర జయ, ఏపీడీ శ్రీరామ్, సచివాలయ కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ వార్డు సెక్రటరీ దొడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింథియా: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం జగనన్న సురక్ష పేరుతో మరో ముఖ్య కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. వార్డు పరిధిలోని 339, 344, 347, 349 సచివాలయాలకు సంబంధించి వార్డు కన్వీనర్లు, గృహసారథులు, వార్డు వలంటీర్లతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలను ఎటువంటి సర్వీస్ చార్జ్ లేకుండా ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. వార్డు కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు తమ క్లస్టర్ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను నమోదు చేసుకుని, వారికి టోకెన్ ఇస్తారని తెలిపారు. వలంటీర్లు ఇచ్చిన టోకెన్ తీసుకుని ప్రజలు జగనన్న సురక్ష క్యాంపులో అందిస్తే అధికారులు సమస్య పరిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు భోగవిల్లి నాగభూషణం, భీశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసుల చుట్టూ తిరగకుండా సర్టిఫికెట్ వచ్చింది



వలంటీర్ మా ఇంటికి వచ్చి సమస్యలు ఏమైనా ఉన్నాయా? ధ్రువపత్రాల అవసరం ఉందా అని అడిగారు. కుల ధ్రువపత్రం కావాలని చెప్పాం. కేవలం మూడు రోజుల్లో సర్టిఫికెట్ చేతికి వచ్చింది. ఏ ఆఫీసుల చుట్టూ తిరగకుండా తెచ్చి ఇచ్చారు. జగన్‌బాబు మంచి పని చేస్తున్నారు.

– పెట్ల చిన్న తల్లి, లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్

ఆరోగ్యశ్రీ కార్డు వచ్చింది



గతంలో మా తల్లిదండ్రులతో కలిసి ఉండడం వల్ల ఆరోగ్యశ్రీ కార్డు రాలేదు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రేషన్ కార్డు నుంచి స్ప్లిట్ అవడం వల్ల ఆరోగ్యశ్రీ కార్డు వచ్చింది. ఇది చాలా మంచి కార్యక్రమం. ఎంతో మంది సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ప్రభుత్వ పథకాలకు అర్హత వస్తోంది. పేదలకు ఇది ఎంతో ఉపయోగకరం.

– రవికుమార్, ఏపీఎస్ఈబీ కాలనీ

కరోనా వారియర్స్‌కు సత్కారం


పోలీస్ సిబ్బందిని సత్కరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన పోలీస్ సిబ్బందిని మంగళవారం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఎస్‌ఐ దేవుడమ్మతో పాటు సిబ్బందిని సత్కరించారు. మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కరోనా సమయం ప్రజలకు ఒక పీడకలగా తోచిందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ శ్రీహరిపురం బ్రాంచ్ సిస్టర్స్ సింధు, అనురాధ,భవాని, బ్రదర్ చినఅప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై టమాటా విక్రయాలు


మర్రిపాలెం రైతు బజారులో టమాటా కౌంటర్ వద్ద వినియోగదారులు

గోపాలపట్నం: రాష్ట్ర ప్రభుత్వం అందించిన సబ్సిడీ టమాటా విక్రయాలు మర్రిపాలెం రైతుబజారులో మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. 1500 కిలోల టమాటా వచ్చిందని ఈవో వరహాలు తెలిపారు. వినియోగదారునికి కిలో చొప్పున రూ.50కి అందించారు.

చెత్తపన్ను రద్దు చేయాలని పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో చెత్త పన్నును రద్దు చేయాలని కోరుతూ మంగళవారం సీపీఎం నాయకులు పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయన్నారు. చెత్తపన్నును ఇంటి పన్నుతో ముడిపెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. చెత్తపన్ను రద్దు చేసేవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, కె.పెంటారావు, ఎం.జయలక్ష్మి, వై.కల్యాణి, ఎస్.వాసు, బాల, ఏసుబాబు, మహిళలు పాల్గొన్నారు.

పోరాట యోధుడు అల్లూరి


అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

మల్కాపురం: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన తెలుగుబిడ్డ, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని సీపీఐ నగర నాయకుడు కె.సత్యాంజనేయ అన్నారు. అల్లూరి జయంతిని పురస్కరించుకుని మల్కాపురంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మన్యం వీరుడి విగ్రహానికి నివాళులర్పించారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుల్లో అల్లూరిది ప్రత్యేక స్థానమన్నారు. చిన్న వయసులోనే ఎంతో ధైర్యంతో బ్రిటిష్ వారితో పోరాడిన ధైర్యశాలి అని కొనియాడారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్య్రం వస్తుందని నమ్మి, దాని కోసమే ప్రాణాలు అర్పించిన యోధుడని, అటువంటి నాయకుడు మన నేలపై జన్మించడం ఎంతో గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడాల రాంబాబు, నూనెల సూరిబాబు యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి

సింథియా: జీవీఎంసీ 62వ వార్డుఅల్లూరిసీతారామ రాజుకాలనీలో మంగళవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజలకు అండగా నిలిచి, సాయుధ పోరాటంతో బ్రిటిష్ వారిని గడగడలాడించారని కొనియాడారు. అడవి తల్లి బిడ్డలకు అండగా పోరాటం చేసిన గొప్ప వీరుడని, నేటి యువత అల్లూరి స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో భోగవిల్లి నాగభూషణం, సచివాలయ కన్వీనర్లు బాబూరావు, రఘు, అనంతలక్ష్మి, వార్డు అధ్యక్షులు గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం సీతారామరాజునగర్ పార్క్‌లో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎన్ రాజు, పి. రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఏ కార్యాలయంలో..

గోపాలపట్నం: స్వాతంత్య్ర పోరాటంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చూపిన తెగువ స్ఫూర్తిదాయకమని డీటీసీ రాజారత్నం అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా ఆర్‌టీఏ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌టీవోలు జె. రామ్‌కుమార్, ఐ.వేణుగోపాలరావు, ఏవోలు ఐ.రఘుబాబు విమల, కరుణాకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీటీసీ రాజారత్నం


అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేస్తున్న శ్రీనివాసరావు, బొమ్మిడి రమణ

మూగజీవాల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

సింథియా: పెంపుడు జంతువుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్త తీసుకోకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ సునీల్‌కుమార్ సూచించారు. పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 6న ప్రపంచ జూనోసిస్ డే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దానిలో భాగంగా బుధవారం గాంధీగ్రామం పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకాలు వేయనున్నట్టు చెప్పారు.

అగనంపూడి ఫ్లై ఓవర్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు


చెక్ పోస్టు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ

అగనంపూడి: నిషేధిత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు హోమీ బాబా క్యాన్సర్‌ఆస్పత్రి కూడలి వద్ద దువ్వాడ పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా, గుట్కా, ఖైనీ వంటి నిషేధిత మత్తు పదార్థాలపై దృష్టి సారించామని దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. చెక్‌పోస్టు సిబ్బంది ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు.

ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లో పాము కలకలం


పట్టుకున్న పాముతో కిరణ్‌కుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనంలో పాము కలకలం సృష్టించింది. మంగళవారం ఉదయం యథావిధిగా విధులకు హాజరైన ఉద్యోగులు అక్కడ పాము తిరగడం చూసి భయంతో పరుగులు తీశారు. వెంటనే స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. అతడు మూల ఉన్న ఐదడుగుల పామును పట్టుకోవడంతో, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. పామును అటవీ శాఖకు అప్పగిస్తానని కిరణ్‌కుమార్ తెలిపారు.

'ఉక్కు'ను కాపాడుకుంటేనే భవిష్యత్తు


శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 873వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన టీపీపీ, ఆర్ఈడీ, పస్టెం, స్టోర్స్, ఎస్ఎండీ తదితర విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు విశాఖ ఉక్కును కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వియత్నాం కార్మిక సదస్సుకు బోసుబాబు


బోసుబాబు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఏఐటీయూసీ పూర్వ అధ్యక్షుడు, సీపీఐ సీనియర్ నాయకుడు జి. బోసుబాబు వియత్నాం కార్మిక సదస్సుకు హాజరవుతున్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోపరేషన్ (ఇస్కఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 15 వరకు సదస్సు జరగనుంది. ఈ సదస్సులో కార్మికుల సమస్యలు, వాటి పరిష్కారాల గురించి చర్చించనున్నారు. ఈ సందర్భంగా అక్కడ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని లేవనెత్తుతామని బోసుబాబు తెలిపారు.

నిస్వార్థ నాయకుల వల్లే స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావం


సమావేశంలో ప్రసంగిస్తున్న మస్తానప్ప

ఉక్కునగరం: నాటి నిస్వార్థ రాజకీయ నాయకుల వల్లే విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఆవిర్భవించిందని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప అన్నారు. దేశంలోని 5వ ప్రతిపాదిత ఉక్కు కర్మాగారం విశాఖలో నెలకొల్పాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానానికి 58 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని డిమాండ్ వచ్చిన నేపథ్యంలో అప్పటికే మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేయాలని నాటి నాయకులు సంకల్పించారన్నారు. 1965 జూలైలో నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయించారన్నారు. అటువంటి ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్నేటి రమణ, కర్రి దాలినాయుడు, మార్టుపూడి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జీవితంపై డాక్యుమెంటరీ


డాక్యుమెంటరీని ఆవిష్కరిస్తున్న కుమార్ తుహిన్. చిత్రంలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అల్లూరి సీతారామరాజు జీవితంపై విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి డాక్టర్ కె.సత్యనారాయణ అధ్యయనం చేసి తీర్చిదిద్దిన డాక్యుమెంటరీని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రీసెర్చ్(ఐసీసీఆర్) డైరెక్టర్ జనరల్ కుమార్ తుహిన్ ఆవిష్కరించారు. అల్లూరి జీవితంలో జరిగిన వివిధ సంఘటనలను సమగ్రంగా దీనిలో వివరించే ప్రయత్నం చేశారు. ఈ డాక్యుమెంటరీని యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సింహగిరి క్షేత్ర వైభవం గ్రంథావిష్కరణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్ర వైభవంపై నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక రచయిత, ఏయు రిటైర్డ్ ప్రొఫెసర్ పెనుమత్స సోమరాజు రచించిన గ్రంథాన్ని మంగళవారం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆవిష్కరించారు. దేవాలయం స్థాపన, అభివృద్ధి చేసిన పాలకులు, పూజా కార్యక్రమాలకు లోటులేకుండా చూసిన మహా దాతలు, ఆధునిక కాలంలో వచ్చిన మార్పులు తదితర అంశాలను గ్రంథంలో పొందుపరిచినట్టు రచయిత సోమరాజు తెలిపారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ట్రస్ట్ బోర్డు సభ్యులు దినేష్‌రాజ్, శ్రీనివాసరావు, శ్రీదేవివర్మ, కృష్ణమూర్తి పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మంగళవారం నగరంలో విస్తృత పర్యటన చేశారు. సిరిపురంలోని దత్ ఐల్యాండ్, బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్, ఎంవీపీ, హనుమంతవాక జంక్షన్, హెచ్‌బీ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, మురళీనగర్, తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దత్ ఐల్యాండ్ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్ పనులను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం గిరి ప్రదక్షిణ మార్గంలో రోడ్లను పరిశీలించారు. పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్లపై పేపర్ ప్లేట్లు అతుక్కుపోయాయని, వాటిని నీటితో తడిపి హెయిర్ ప్రెషర్‌తో తొలగించాలని సూచించారు. రహదారులు మునుపటి వలే ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని జోనల్ కమిషనర్లను ఆయన ఆదేశించారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడి దృష్టికి భెల్ ఉద్యోగుల సమస్యలు


సుభాష్ పార్థీకి వినతిపత్రం అందిస్తున్న భెల్ జై భీమ్ వర్గం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (జై భీమ్) వర్గం ప్రతినిధులు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు సుభాష్ పార్థిని మంగళవారం కలిశారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో పార్థిని కలిసి, సంస్థలో ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన త్వరలో హెచ్‌పీవీపీ యూనిట్‌కు విచ్చేసి యాజమాన్యంతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సునీల్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కె.ఎస్.పి.చక్రవర్తి, భెల్ జై భీమ్ వర్గం ఎస్సీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు టి.రవి కిషోర్, రాము, హెచ్.భోగేష్ తదితరులు పాల్గొన్నారు.